సాక్షి
మంచిర్యాల

సోమవారం । 5 । ఆగస్టు । 2024



శ్రావణం..శుభప్రదం

శ్రావణం..శుభప్రదం..ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకువస్తుంది. నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, తదితర పండుగలు ఈ మాసంలోనే వస్తాయి. 8లో▸



కంపుకొడుతోంది..! 9లో▸

చెన్నూర్ మున్సిపాలిటీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. డ్రెయినేజీల నిర్మాణం సక్రమంగా లేక నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /26.6

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చంద్రమోహన్‌గౌడ్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న చంద్రమోహన్

పాతమంచిర్యాల: పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు ఉదారి చంద్రమోహన్‌గౌడ్‌కు హైదరాబాద్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు బాబురావు, సునీల్‌కుమార్ లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ అవార్డు అందజేశారు. 2023–24 సంవత్సరానికి యూత్ ఎక్స్ఛేంజ్, స్పోర్ట్స్‌లో ఉత్తమ సేవలందించినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌గౌడ్ మాట్లాడుతూ ఈ అవార్డు ద్వారా యువతకు సేవలందించే బాధ్యత పెరిగిందన్నారు. రాను న్న రోజుల్లో యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

8న విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై శిక్షణ

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర గ్రీన్‌కోర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో ఈనెల 8న ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో పర్యావరణ క్షీణత, వనరుల వినియోగం, సీవో–2 ఉద్గారాలు, వ్యర్థాలు, సామాజిక–ఆర్థిక అభివృద్ధి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలకు తోడ్పాటునిచ్చే మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ప్రతీ ఎన్‌జీసీ ఏకో క్లబ్ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున 150 మంది విద్యార్థులకు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ తయారీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 8, 9వ తరగతి విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 6వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని పేర్కొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం



సమావేశంలో నాలుగో తరగతి ఉద్యోగులు

పాతమంచిర్యాల: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీట్ల సునీత మాట్లాడుతూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, జీవో 317 బాధితుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులు పనిచేసేచోట మౌలిక వసతులు కల్పించడం, మహిళా ఉద్యోగుల సమయపాలనపై చర్చించామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కమ్మల గోవర్ధన్, కోశాధికారి శీలం శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉద్యోగులు పాల్గొన్నారు.

‘ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకం’



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోషిక మనోజ్‌కుమార్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సీసీసీ కార్నర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టు మధూకర్, జిల్లా సెక్రెటరీ మండల రవికుమార్, అధికార ప్రతి నిధి మల్లయ్య, నాయకులు రామస్వామి, నందయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొమ్ము.. కాంట్రాక్టర్ల జేబుల్లోకి..!

- ప్రైవేటు సిబ్బందికి ‘సీఎంపీఎఫ్’ బదులు ‘ఈపీఎఫ్’
- సింగరేణి సంస్థ ఓసీపీ వర్క్ ఆర్డర్‌లో ఆప్షన్..
- తమకు అనుకూలంగా మార్చుకున్న కాంట్రాక్టు సంస్థలు
- ఏటా ఆయా సంస్థలకు రూ.కోట్లలోనే మిగులు
- చట్టుబండలవుతున్న కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ చట్టం



శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ప్రైవేటు కార్మికులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణిలో కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ చట్టం.. కాంట్రాక్టర్ ప్రాఫిట్ ఫండ్‌గా మారింది. కార్మికులకు మేలుచేసే చట్టాన్ని కచ్చితంగా అమలు చేయించాల్సిన యాజమాన్యం కాంట్రాక్టర్లకు మేలు కలిగేలా ఆప్షన్ ఇచ్చింది. ఇదే కాంట్రాక్టు సంస్థలకు వరంగా మారగా.. రెక్కలు ముక్కలు చేసుకుని తక్కువ వేతనాలకే పని చేస్తున్న ప్రైవేటు సిబ్బందిపాలిట శాపంగా మారింది. ఏళ్లుగా కాంట్రాక్టర్లు ప్రైవేటు సిబ్బందికి నష్టం చేస్తూ.. కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారు. బొగ్గు గనుల్లో పనిచేసే రెగ్యులర్ సిబ్బందితోపాటు ప్రైవేటు కార్మికులకు ఉద్యోగ భద్రతలో సీఎంపీఎఫ్ఓ(కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) ఇవ్వాలి. కానీ ఈపీఎఫ్(ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్) చెల్లిస్తూ భారీగా సొమ్ము మిగిల్చుకుంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా 17 ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు (ఓసీపీ)ల్లో మట్టి తవ్వకాల పనులను 21 మంది కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్నారు. వీరి పరిధిలో 18 వేల నుంచి 20 వేల మంది ప్రైవేటు సిబ్బంది పనిచేస్తున్నారు. కాంట్రాక్టర్లను బట్టి ఏడాది నుంచి ఏడేళ్ల వరకు వర్క్ ఆర్డర్స్ ఇచ్చారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రత్యక్ష, పరోక్షంగా పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా ‘సీఎంపీఎఫ్’ చెల్లించాలని చట్టం చెబుతోంది. కానీ కాంట్రాక్టర్లు తమకు లాభమయ్యే పథకాన్ని ఎంచుకుని భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఏటా రూ.కోట్లలో మిగులు

కాంట్రాక్టర్ల తీరుతో ఏటా రూ.కోట్లలోనే కార్మికులు నష్టపోతున్నారు. ఉదాహరణకు ఒక ప్రైవేటు ఉద్యోగి జీతం నెలకు రూ.15 వేలు ఉంటే ఈపీఎఫ్ పథకంలో ఉద్యోగి, కాంట్రాక్టు సంస్థ వాటా 12 శాతం చొప్పున మొత్తంగా 24 శాతం చెల్లించాలి. ఇందులో ఉద్యోగి వాటా నెలకు రూ.1,800, సంస్థ వాటా అంతే మొత్తం కలిపి రూ.3,600 పీఎఫ్ ఖాతాలో జమ అవుతాయి. కానీ సీఎంపీఎఫ్‌లో నెలకు రూ.15 వేల జీతమున్న అదే ఉద్యోగికి 19 శాతంతో ఉద్యోగి వాటా రూ.2,850.. ఇంతే మొత్తంలో కాంట్రాక్టు సంస్థ వాటా కలిపితే మొత్తం 38 శాతం రూ.5,700 జమ చేయాలి. ఈ రెండింటి మధ్య ఏడు శాతం వ్యత్యాసం ఉంది. ఈ లెక్కన రూ.15 వేలు చెల్లించే ఒక ఉద్యోగి పేరిట కాంట్రాక్టర్‌కు నెలకు రూ.1,050 మిగులుతోంది. రూ.20 వేల వరకు జీతం తీసుకునేవారూ ఉన్నారు. ఇలా సింగరేణిలో వేలాది మందికి ప్రతీ నెల, ఏడాదికి లెక్కిస్తే ఈ మొత్తం భారీగా ఉంటుంది. ఇక సీఎంపీఎఫ్‌లో ఉద్యోగి జీతంపై పరిమితి లేదు. కానీ ఈపీఎఫ్‌లో రూ.15 వేల వరకే సీలింగ్ ఉంది. పింఛన్ పొందడంలోనూ వ్యత్యాసాలు ఉంటాయి.

కాంట్రాక్టర్లకు మేలు చేసే ఆర్డర్లు

ఓసీపీల్లో పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థలు బొగ్గు పనులు చేసే సంస్థలుగా కాకుండా సివిల్ వర్క్స్ చేస్తున్న సంస్థలుగానే కార్మికశాఖ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. దీంతో సులువుగా ఈపీఎఫ్ పథకంలో తమ ఉద్యోగులను చూపిస్తున్నారు. వాస్తవానికి బొగ్గు ఉత్పత్తిలో పాల్గొనే ఏ సంస్థ అయినా సీఎంపీఎఫ్ పరిధిలోనే ఉండాలి. ఒకవేళ మార్చాల్సి వస్తే, అంతకంటే ఎక్కువగా ఉద్యోగులకు మేలు చేసే పథకంగా ఉండాలి. సింగరేణి యాజమాన్యం కూడా కాంట్రాక్టు సంస్థలకు ఈపీఎఫ్ లేదా సీఎంపీఎఫ్ ఎంపిక చేసుకోవచ్చని వర్క్ ఆర్డర్‌లో ఆప్షన్ అవకాశమిచ్చింది. కాంట్రాక్టర్లు ఆప్షన్‌ను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. డబ్బులు మిగిలే పథకాన్నే ఎంచుకుని కార్మికుల నష్టం కలిగిస్తున్నారు. కాంట్రాక్టర్లకు ఈపీఎఫ్ ఎంచుకునే ఆప్షన్ ఇవ్వడాన్ని సీఎంపీఎఫ్ అధికారులు తప్పుబడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో మూడేళ్ల క్రితమే ఆ ఆప్షన్ తీసేయాలని కొత్తగూడెం, రామగుండం ప్రాంతీయ కార్యలయాల కమిషనర్లు సింగరేణి యాజమాన్యానికి లేఖలు రాశారు. అయినా సంస్థ తరఫున ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

మా దృష్టికి వచ్చింది..

సింగరేణిలో కాంట్రాక్టు సంస్థలు కార్మికులకు సీఎంపీఎఫ్ బదులు ఈపీఎఫ్ చెల్లిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై సంస్థకు లేఖ రాశాం. ఈపీఎఫ్ ఆప్షన్ తొలగించాలని సూచించాం. దీనిపై మా అధికారులతో తనిఖీలు చేయిస్తున్నాం.

– ఎం.కనకమ్మ, రీజనల్ కమిషనర్, సీఎంపీఎఫ్, కొత్తగూడెం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..



ఏళ్లుగా ఓసీపీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు సంస్థలు తమ సిబ్బందికి ఈపీఎఫ్ చెల్లిస్తూ భారీగా సొమ్ము మిగుల్చుకుంటున్నాయి. దీనిపై సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కార్మికులకు సీఎంపీఎఫ్ చెల్లించాలి.

– నయీంపాషా, సామాజిక కార్యకర్త, మంచిర్యాల

‘ఈపీఎఫ్’లోనూ గోల్‌మాల్

‘సీఎంపీఎఫ్’ బదులు ‘ఈపీఎఫ్’ అమలు చేస్తూ, కొందరు కాంట్రాక్టర్లు అందులోనూ కక్కుర్తి పడుతున్నారు. ప్రతినెలా ఈపీఎఫ్ చెల్లించేప్పుడు కార్మికుల సంఖ్య, రోజువారీ మస్టర్లు తక్కువగా చేస్తూ, తమ వాటాను తగ్గించుకుంటున్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓ కాంట్రాక్టు సంస్థ తమ సిబ్బందికి చెల్లిస్తున్న వాస్తవ జీతం కన్నా తక్కువ మొత్తాన్ని పీఎఫ్ శాఖకు చూపిస్తూ గత 18 నెలల్లో రూ.56 లక్షలు వెనకేసుకుంది. కొత్తగూడెం జేవీఆర్ ఓసీ 2లో మట్టి తవ్వకాలు చేస్తున్న ఓ కాంట్రాక్టు సంస్థ తమ సిబ్బందిని తక్కువ చూపించి, దాదాపు రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు మిగుల్చుకుంది. ఇలాంటి మోసాలు ఈపీఎఫ్ పరిధిలో జరుగుతున్నా.. కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు



దుర్వాసన వస్తున్న కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని పిన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. గ్రామంలో ఒకరికి పంపిణీ చేసిన కోడిగుడ్లను ఆదివారం ఉడకబెట్టగా దుర్వాసన రావడంతో వాటిని పడేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రోజుల తరబడి నిల్వ ఉన్న కోడిగుడ్లు పంపిణీ చేస్తుండడంపై గర్భిణులు, బాలింతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. చెన్నూర్ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తక్కువ పరిమాణం ఉన్న, కుళ్లిన గుడ్లు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఐసీడీఎస్‌లో ఓ అధికారి భయంతో అంగన్‌వాడీ టీచర్లు కూడా ఏమీ చేయలేకపోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు అందేలా చూడాలని కోరారు. ఈ విషయంపై సూపర్‌వైజర్ మాధవిని వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లను అందిస్తున్నామని తెలిపారు. కుళ్లిన కోడిగుడ్లు వస్తే తిరిగి వెనక్కి ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

17 నుంచి శిక్షణ తరగతులు

మంచిర్యాలఅర్బన్: ఈనెల 17 నుంచి 19 వరకు సిద్దిపేటలో రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. మంచిర్యాల ఎస్టీ బాలుర హాస్టల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక విద్య కాషాయీకరణ వేగవంతమైందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కనీసం విద్యారంగానికి 20 శాతం నిధులు కూడా కేటాయించలేదని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సిద్దార్థ, నాయకులు చరణ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వాలు విఫలం



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు

బెల్లంపల్లి: మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.జ్యోతి అన్నారు. బెల్లంపల్లిలో ప్రగతిశీల మహిళా సంఘం ఏడో మహాసభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జ్యోతి హాజరై మాట్లాడారు. అనాది నుంచి మహిళలు అన్ని రంగాల్లో వివక్ష, అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. కట్టుబాట్ల పేరుతో మహిళలను వంటింటికి పరిమితం చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు రెండవ శ్రేణి పౌరులుగానే మహిళలను చూస్తున్నారని పేర్కొన్నారు. బేటి బచావో బేటి పఢావో నినాదం నీటి మూటగా మారిందని ఎద్దేవా చేశారు. జనాభాలో సగభాగమైన మహిళలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నిరంగాల్లో ఎదగాలని సూచించారు. మహిళా సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు మహిళా లోకం సిద్ధం కావాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బెల్లంపల్లి డివిజన్ కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థలో మహిళలను అంగడి సరుకుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎన్నిక..

మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బెల్లంపల్లి డివిజన్ కమిటీ అధ్యక్షురాలుగా రాజక్క, ఉపాధ్యక్షురాలుగా ఓదక్క, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా ఆఫ్రీనా, కోశాధికారిగా ఈశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు డి.అరుణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



మాట్లాడుతున్న శంకర్

రామకృష్ణాపూర్: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాటాలు సాగిస్తూ ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజల పక్షాన అనేక పోరాటాలు సాగించిన సీపీఐ పార్టీని, దాని అనుబంధ సంఘాలను మరింత బలోపేతం చేసుకుంటూ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం కావడంతోనే ఆ పార్టీని ప్రజలు ఎన్నికల్లో ఓడించారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే అదే గతి పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, మిట్టపెల్లి పౌల్, పెరుక సంపత్, కమలమ్మ, వనం సత్యం, నక్క వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం వ్యాఖ్యలు అభ్యంతరకరం’

శ్రీరాంపూర్: ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారు ప్రైవేటు స్కూల్‌పెట్టుకుని నడుపుతున్నారని, ఉపాధ్యాయులకు విద్యార్హతలు లేదని వ్యాఖ్యానించడం అర్థరహితమన్నారు. 95 శాతం ఉపాధ్యాయులు ట్రైన్డ్ టీచర్స్ ఉన్నారని తెలిపారు. డీఎస్సీ నిర్వహించకపోవడంతో ట్రైన్డ్ టీచర్లు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 5 లక్షల మంది టీచింగ్, నాన్ టీచింగ్‌స్టాఫ్ పని చేస్తున్నారని, వీరి మనోభావాలు దెబ్బతీసేలా సీఎం మాట్లాడడం సరికాదని అన్నారు.

‘గురుకులం’లో సీనియర్లు, జూనియర్ల ఘర్షణ

- జూనియర్ విద్యార్థికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులు గొడవపడ్డారు. కొన్ని రోజులుగా సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. జూనియర్ విద్యార్థి తరుణ్‌ను సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారు. శనివారం కూడా వేధించడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సీనియర్లు తరుణ్ తమ ట్రంకు పెట్టె దొంగతనం చేశాడని ఆదివారం ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ తరుణ్‌ను పిలిచి మందలించాడు. తాను దొంగతనం చేయలేదని, కావాలనే సీనియర్లు తనపై ఫిర్యాదు చేశారని తరుణ్ తెలిపాడు. ఈ క్రమంలో ఆవేశంతో కిటికీని కొట్టడంతో అతడి చేయికి అద్దం గుచ్చుకుని రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేయించి వైద్యుల సూచన మేరకు కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

పారిశుద్ధ్యం మెరిసేలా.. పచ్చదనం మురిసేలా..

- నేటి నుంచి స్వచ్ఛదనం–పచ్చదనం
- ఈ నెల 9 వరకు పలు కార్యక్రమాలు
- మొక్కలు నాటడం, దోమలను అరికట్టడం..
- పారిశుద్ధ్యం మెరుగుపర్చడమే లక్ష్యం..



మంచిర్యాలటౌన్: జిల్లాలోని పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడేలా ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. పచ్చదనాన్ని పెంచుతూ, పరిశుభ్రతను మెరుగుపరిచేలా ఐదు రోజులపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 311 గ్రామ పంచాయతీలు, 7 మున్సిపాలిటీల్లో ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాకు ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కె.ఇలంబరిదిని నియమించారు. గ్రామాలు, పట్టణాలను శుభ్రపరచడం, ఇంటిస్థాయి, కమ్యూనిటీ స్థాయిల్లో మొక్కలు నాటడం వంటివి చేపట్టనున్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా చూడనుండగా, పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామస్థాయిలో కార్యక్రమ అమలు బాధ్యతలను నిర్వర్తించనుండగా, మున్సిపాలిటీల్లో కమిషనర్లు బాధ్యతలను నిర్వహిస్తారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

5వ తేదీన..

స్థానిక నాయకులు, ఎస్‌హెచ్‌జీలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి, ర్యాలీలను చేయనున్నారు. ఎస్‌హెచ్‌జీల సమావేశంలో ప్రచార చిత్రాల ద్వారా వీధి కుక్కల బెడదపై, ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించనున్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కంపోస్టుగా మార్చడం, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తోటల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. బహిరంగ ప్రదేశాలు, వీధులను శుభ్రపరిచి, రోజువారీ ప్రాతిపదికన హాని కలిగించే చెత్త పాయింట్లపై దృష్టిపెట్టనున్నారు. ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను శ్రమదానంతో తొలగించే కార్యక్రమాలను చేపట్టనున్నారు. మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి, వారికి 15 రోజుల్లో నూతనంగా అనుమతులను ఇచ్చి పూర్తి చేసేలా చూస్తారు.

6వ తేదీన..

తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడంతోపాటు, ప్రతిరోజూ క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు సరఫరా చేస్తారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేని ప్రాంతాలు, తక్కువ తాగునీరు సరఫరా అయ్యే ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలను తీసుకోవడం, 300 చదరపు గజాల విస్తీర్ణం గల భవనాలను గుర్తించి, వాటికి వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ద్వారా నీటి నిల్వ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు.

7వ తేదీన

జిల్లాలోని అన్ని మురికి కాలువల పూడికతీత పనులను చేపట్టి, లోతట్టు ప్రాంతాల్లో, నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ మొరం నింపి, నీరు నిల్వ లేకుండా చూస్తారు. నీటి నిల్వ గుంతలను మొరం, వెట్‌మిక్స్ ద్వారా పూడ్చి, మురికి కాలువల చివరలో ఇంకుడు గుంతలను నిర్మించేలా పలు కార్యక్రమాలను చేపట్టనున్నారు. అన్ని ప్రభుత్వ, పబ్లిక్ స్థలాలను శుభ్రపరిచి, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటారు.

8వ తేదీన

స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు పాఠశాలల్లో సమావేశాలను నిర్వహించి డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించడం, సీజనల్ వ్యాధులను నివారణకు ప్రజలకు అవగాహన కల్పించి, ఆరోగ్య కార్యకర్తల సేవలను అందించనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సర్వేలు చేసి, వ్యాధులు ఏమేరకు ప్రబలుతున్నాయో తెలుసుకోనున్నారు. ఏదైనా ప్రాంతంలో జ్వరాలు ఎక్కువగా వస్తే, ఆ ప్రాంతంలో నివారణ చర్యలను చేపట్టి, దోమలు లేకుండా ఫాగింగ్‌ను చేయడం, నీరు నిల్వ ప్రాంతాల్లో దోమలను నిరోధించే ఆయిల్ బాల్స్‌ను వేస్తారు. వీటితో పాటు యాంటీ లార్వా రసాయనాలను పిచికారీ చేయడం, ప్రతీరోజు ఫాగింగ్ చేసి దోమల నివారణకు కృషి చేస్తారు. వీధికుక్కల సర్వే చేసి, వాటి నుంచి ప్రజలను రక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సమీక్షించనున్నారు.

9వ తేదీన

అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రతీ ఇంటిని సందర్శించి, ఇంటి ఆవరణలో ఉన్న నీటి నిల్వలను తొలగిస్తారు. ఇళ్లు పరిశుభ్రంగా ఉండేలా, ఉపయోగించని వస్తువులను ఇంటి నుంచి తొలగించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో డ్రైడే నిర్వహించి, టీకప్పులు, సీసాలు, టైర్లు, వస్తువులను తొలగించి దోమలు వృద్ధి చెందకుండా చూస్తారు. పాత సామగ్రి, టైరు పంక్చర్ షాపులు, వెక్టర్‌సోర్స్‌ల షాప్‌లను తనిఖీ చేసి, నీరు నిల్వ ఉంచకుండా సూచనలు చేస్తారు. ప్రభుత్వ సంస్థల పైకప్పులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాండ్‌లు, క్రీడామైదానాలను శుభ్రపరచడం చేస్తారు. శిథిలమైన భవనాలు, గోడలను తొలగించి, ఎండిపోయిన, కుళ్లిపోతున్న చెట్లు, వాటి కొమ్మలను తొలగిస్తారు. వనమహోత్సవంలో మొక్కలు నాటుతారు.



నస్పూర్: ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ శ్రీరాంనగర్ ఆదిపరాశక్తి భువనేశ్వరిమాతకు భక్తులు బోనాలు సమర్పించారు. భక్తులు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో సీసీసీ కార్నర్ నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

రొయ్యలపల్లి వాసికి ఏఈఈ ఉద్యోగం



తల్లితో గంగరాజు

కోటపల్లి: మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన దుర్గం గంగరాజు పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం మైసక్క–లచ్చయ్య దంపతుల కుమారుడు గంగరాజు చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి మైసక్క కూలీపని చేస్తూ గంగరాజును చదివించింది. గ్రామంలోనే పాఠశాల విద్య పూర్తిచేసిన గంగరాజు హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఉద్యోగ నోటిఫికేషన్లు రావడంతో ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ప్రిపేర్ అయ్యాడు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాడు. గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు. తాజాగా ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పక్కా సమాచారంతో కిష్టంపేటలో శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యజమాని అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నాడని, గతంలో ఈ ట్రాక్టర్‌ను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారని వివరించారు.

వాంకిడిలో..


పట్టుబడిన వాహనంతో పోలీసులు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి గ్రామానికి చెందిన కపుల్ శ్యాంరావు డీసీఎం వాహనంలో ఇసుకను తరలిస్తున్నాడు. ఖమాన ఎక్స్‌రోడ్ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. వాహనం పట్టుకుని, శ్యాంరావుపై కేసు నమోదు చేసి వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై గంగన్న, పోలీస్ కానిస్టేబుల్ సంజీవ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కెరమెరి: మండలంలోని సాంగ్వి వాగు వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కెలిబి గ్రామానికి చెందిన లోబడే నారాయణ బైక్‌పై కెరమెరికి వస్తున్నాడు. ఇందాపూర్‌కు చెందిన వాడై కుమార్ కెరమెరి నుంచి ఇందాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కెరమెరి పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి


సలీం (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత సలీం విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండలంలోని హర్కాపూర్ గ్రామంలో తనకున్న సర్వీసింగ్ పాయింట్ వద్ద పనులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడు సోఫియాన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ప్రతిరోజూ ప్రత్యేకతే
- నెలరోజులూ పూజలు, వ్రతాలు


వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: శ్రావణం..శుభప్రదం.. ఈ మాసం ఎంతో ప్రాముఖ్యత ఉంది. పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించటం వల్ల శ్రావణమాసం పేరు వచ్చిందని వేదపండితులు చెబుతున్నారు. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకువస్తుంది. ఇక నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు ఈ మాసంలో రావడం దీని ప్రత్యేకత. ఈనెలలో మహిళలు పూజలతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి.

మార్కెట్‌లో సందడి..

ఈ మాసంలో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. నూతనవస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలోని పలు వస్త్ర దుకాణాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించి వినియోగదారులను అకట్టుకుంటున్నాయి. పూలు, పండ్ల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.

సోమవారం: ముక్కంటి ఈశ్వరునికి సోమవారం ఎంతో ప్రీతికరమైన రోజు. శివుడికి అభిషేకం చేసి పూజలు నిర్వహిస్తే స్వామి కటాక్షాన్ని పొందవచ్చు. అర్చనలు చేసి నమస్కరిస్తే సకల పాపాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

మంగళవారం: అభయమిచ్చే ఆంజనేయుడు..సకల విఘ్నాలు తొలగించి ముందుగా పూజలందుకునే విఘ్నేశ్వరుడు. సంతాన భాగ్యాన్ని కలిగించే సుబ్రహ్మణ్యేశ్వరుడు మంగళవారమే జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. మంగళగౌరికి ప్రీతికరమైన రోజు. ఆయా దేవతలందరినీ భక్తిశ్రద్ధలతో పూజిస్తే శుభాలు కలుగుతాయని నమ్మకం.

బుధ,గురువారాలు: శ్రావణమాసంలో బుధవారం అయ్యప్ప స్వామికి, గురువారం రాఘవేంద్ర స్వామి, దక్షణమూర్తి, సాయిబాబాలకు ప్రీతికరమైన రోజులు. ఆయా దేవతలను, గురువులను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం.

శుక్రవారం: శ్రావణమాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఎంతో ప్రాధాన్యం. వరలక్ష్మి వ్రతం ఆచరించే వారికి శుభప్రదమైన వారం. అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, అల్లిన మల్లెల మాలను సమర్పిస్తే పాపాలు తొలగి రుణవిముక్తి, లక్ష్మీ కటాక్షం, సౌభాగ్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

శనివారం: కలియుగదైవం శ్రీనివాసుడికి ఎంతో ప్రీతికరమైన రోజు శనివారం. ఉపవాస దీక్షలు చేపడతారు. స్వామివారికి పుష్పార్చనలు, తులసీదళల మాలలు సమర్పిస్తారు. ప్రతి శనివారం ఇలా చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

ముహూర్తాలు ఇలా..

మూఢంతో మూడు నెలలు శుభకార్యాలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసం కొనసాగనుంది. ఈనెల 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మహిళలు ఇంటిటా ప్రత్యేక పూజలతోపాటు ఉపవాస దీక్షలు చేస్తారు. రెండో శుక్రవారం 16న వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. అలా కుదరని వారు నాలుగవ శుక్రవారం 30న ఆచరిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీదేవికి, ఆలయాల్లో పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలుంటాయి.

సకల శుభాలు ఈమాసంలో..



శ్రావణమాసంలో భక్తితో భగవంతుడిని ఆరాధిస్తే సకల శుభాలు వరిస్తాయి. పండుగలు, పర్వదినాలకు నోములు, వ్రతాలకు అనువైన మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మీని కొలిచే శ్రావణంలో శివశక్తిని పూజిస్తారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం.

– శంశాక్, అర్చకుడు, మంచిర్యాల

శ్రావణం..భక్తి మాసం



శ్రవణ నక్షత్రమే వేంకటేశ్వరస్వామి అవతార నక్షత్రం. ఈ మాసాన్ని మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మంగళగౌరి వ్రతం, వరలక్ష్మీ వ్రతాలతో అమ్మవారిని కొలుస్తారు. దీక్షలు చేస్తారు. రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఈనెలలోనే వస్తాయి. అందుకే శ్రావణ మాసాన్ని భక్తిమాసంగా భావిస్తారు.

– ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి, పురోహితుడు, వదూర్

10న సత్యనారాయణ వ్రతం

బాసర: బాసరలోని శ్రీ పాపాహరేశ్వర ఆలయంలో ఈనెల 10న సామూహిక సత్యనారాయణ వ్రత పూజ నిర్వహించనున్నట్లు శ్రీ త్రిపుర వత్సలా రామసేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 37 మంది దంపతులు పాల్గొంటారని వివరించారు. (పూజకి కూర్చునే దంపతులు) పురుషులు కండువా తిలకధారణ/మహిళలు చీర గాజులు, మంగళహారతి, కలశం, పువ్వులు, పండ్లు తీసుకు రావాలని పేర్కొన్నారు. వ్రత పూజలో పాల్గొనే వారు ఈనెల 8లోపు ఆలయంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జన్నారం: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కాలెండర్ విడుదల చేసిందని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు రాజన్న, ఫసీఉల్లా, నందునాయక్, సతీశ్, కరుణాకర్, అజార్, మౌళానా, పాల్గొన్నారు.

తమ్ముడు మాట వినడం లేదని అన్న ఆత్మహత్య

- ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో ఘటన
- కేసు నమోదు


శివ (ఫైల్)

ఖానాపూర్: మద్యానికి బానిసై తమ్ముడు ఏ పనిచేయడం లేదని, తన మాట వినడం లేదని మనస్తాపంతో అన్న బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని మస్కాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన లోనికి సత్తవ్వ, పెంటయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు శివకుమార్ (33) మలేషియా వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో కుటుంబీకులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కాగా, తమ్ముడు రాకేశ్ ఇంటి వద్దే ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. పలుమార్లు అతన్ని హెచ్చరించినా మార్పు రాలేదు. దీంతో శివకుమార్ మనస్తాపం చెంది శనివారం రాత్రి మస్కాపూర్ శివారులోని ఓ వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో రెండు మృతదేహాలు



గుర్తుతెలియని వృద్ధుడి, యువకుడి మృతదేహాలు

- బాసర వద్ద కలకలం

బాసర: బాసర వద్ద గోదావరి నదిలో ఆదివారం రెండు మృతదేహాలు కలకలం రేపాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. ఒకటి వృద్ధుడి మృతదేహంగా గుర్తించారు. వయసు 60 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో మృతదేహం యువకుడిదని, వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని వెల్లడించారు. మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారం వ్యవధిలో నలుగురి మృతదేహాలు లభ్యం కావడం చర్చనీయంగా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి వరద వస్తుండడంతో మృతదేహాలు కొట్టుకొస్తున్నట్లు భావిస్తున్నారు.

ఐదు కిలోల గంజాయి పట్టివేత


నిందితుడితో పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలోని నర్సాపూర్ చౌక్ వద్ద బైక్‌పై ఐదు కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నార్నూర్ మండలం చోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బాక్సండ్‌సింగ్ 5 కిలోల గంజాయిని విక్రయించడానికి బైక్‌పై ఆదిలాబాద్ వెళ్తున్నాడు. పక్కా సమాచారంతో ఆదివారం తనిఖీ చేయగా గంజాయి లభించింది. స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సై సునీల్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన సాహెర్‌ని పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహా రాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ చిన్న,చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నాడు. ఆదివారం తాటిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో విక్రయిస్తుండగా పట్టుకుని 80 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2వేలు ఉంటుందని తెలిపారు. ఒక్కో ప్యాకెట్ ను రూ.100కు విక్రయిస్తున్నాడని, 13 వరకు ప్యాకెట్లు ఆయన వద్ద లభ్యమైనట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో పట్టుకున్నామని ఎస్సై వివరించారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తాం


ధర్నా చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు



మాట్లాడుతున్న పసుల రామ్మూర్తి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తామని మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు పునరాలోచించాలన్నారు. ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే 'హలో మాల చలో ఢిల్లీ'కార్యక్రమానికి వేలాదిగా మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

తలమడుగు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఎస్సీలు ఐక్యంగా ఉన్నప్పటికీ విడిగొట్టేందుకు వర్గీకరణ బిల్లు చేపట్టడం సరి కాదన్నారు. సుప్రీంకోర్టు ఆబిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవన్న, చంటి, గంగన్న, నారాయణ, వేణు, శ్రీనివాస్, అనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

దండేపల్లి: మాలల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని జైభీమ్ సైనిక్‌దళ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం అన్నారు. దండేపల్లిలో ఆదివారం మాలమహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం దండేపల్లి మండల యువజన తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపల్లి జీవన్, ఉపాధ్యక్షుడిగా తీగల జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా వెంకటేశ్, సలహాదారుగా సాగర్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


చౌదరి నవీన్ (ఫైల్)

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం.. కుంచవెల్లికి చెందిన చిప్ప సూరజ్‌కు ఎలక్ట్రికల్ షాపు ఉంది. చౌదరి నవీన్ (17)తో కలిసి సామగ్రి కొనుగోలు కోసం బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లారు. తిరిగివస్తుండగా మండల కేంద్రం మల్లన్న ఒర్రె సమీపంలోని కల్వర్టు వద్ద ఆగి ఉన్న మరో బైక్‌ను అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రైతుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్సులో కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ చౌదరి నవీన్ మృతి చెందాడు. నవీన్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చౌదరి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కుక్కలదాడిలో చుక్కలదుప్పి మృతి


చుక్కల దుప్పి మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: కుక్కల దాడిలో ఆదివారం చుక్కల దుప్పి మృతి చెందింది. మండలంలోని కడంబా అటవీ ప్రాంతం నుంచి కుక్కలు దప్పిని తరుముతూ భీమన్న ఆలయం వరకు వచ్చింది. ఆ సమయంలో కౌటాల మండలం బోదంపల్లికి చెందిన అనిల్ వాటిని తరిమివేశాడు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో దుప్పి మృతి చెందింది. ఎఫ్ఎస్ఓ సుభాన్‌గౌరీ, సిబ్బంది గణేశ్, మల్లేశ్, రాంచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ రమాదేవి తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

నెన్నెల: మండలంలోని పెద్ద లంబాడితండాకు చెందిన ధరావత్ తరుణ్ బైక్‌పై గుడుంబా తరలిస్తుండగా ఆదివారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెల శివారులో బైక్‌పై వెళ్తున్న తరుణ్ అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు తనిఖీ చేయగా బ్యాగులో నాటుసారా లభించింది. పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రాట్యూటీ సర్వీస్ డబ్బులు చెల్లించాలి

జైపూర్: ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపట్టిన స్టీగ్ కంపెనీకి సబ్ వ్యవహరించిన కంపెనీలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు గ్రాట్యూటీ సర్వీస్ డబ్బులు వెంటనే చెల్లించాలని హెచ్ఎంఎస్ ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్ తెలిపారు. జైపూర్‌లో ఆదివారం నిర్వహించిన హెచ్ఎంఎస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ డబ్బులు చెల్లించకుండా సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రెండేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యక్షుడు సంపత్, సాయికృష్ణ, నాయకులు శ్రీధర్, మరేశ్, అజయ్, అంజి పాల్గొన్నారు.

మళ్లీ.. కాలేజీ రోజుల్లోకి


రజతోత్సవంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఆనాటి అధ్యాపకులు

నిర్మల్: వారంతా ఎప్పుడో పాతికేళ్ల క్రితం కలిసి ఇంటర్ చదువుకున్న మిత్రులు. ఆ తర్వాత ఉన్నతవిద్య, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, పిల్లలు.. ఇలా ఎవరితోవలో వారు సాగిపోయారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. మళ్లీ..ఆనాటి తమ కాలేజీ రోజుల్లోకి వెళ్లారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో 1997–98లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకున్న బ్యాచ్ పూర్వవిద్యార్థులు సరిగ్గా స్నేహితుల దినోత్సవమైన ఆదివారం స్థానిక మారుతీఇన్‌లో రజతోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్కడెక్కడో ఉంటున్న పాతమిత్రులంతా తరలివచ్చారు. ఇన్నేళ్లపాటు కలుసుకోని వారైతే.. అప్యాయంగా మాట్లాడుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా కలిసి రోజంతా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి ప్రిన్సిపాల్ సాయన్నతో సహా గురువులను సన్మానించుకున్నారు. కార్యక్రమ సమన్వయకర్తలు మునిగెల సాయిప్రసాద్, అరుణ్, శ్రీహరి, సబిత, సంధ్య మిగతా మిత్రులు ఏర్పాట్లు చూసుకున్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు


శ్రీరాఘవేంద్ర హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీరాఘవేంద్ర హైస్కూల్‌లో 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అందరూ కలిసి ఒకరినొకరు ఆప్యాయతతో పలుకరించుకుని అలింగనం చేసుకుని చిన్ననాటి /జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి బోజనం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం


సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

పాతమంచిర్యాల: నస్పూర్ మున్సిపాలిటీలోని సరస్వతి శిశుమందిర్‌లో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్ఎం ధూళిపాల కాశీ విశ్వనాథం, పూదరి సత్యనారాయణ, ఆచార్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం


కిరణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికైన గడ్డం కిరణ్‌కుమార్‌ను స్థానిక పద్మశాలి భవనంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హైకోర్టులో కొంతకాలం న్యాయవాదిగా పని చేసి తన ప్రతిభతో కిరణ్‌కుమార్ పబ్లిక్ ప్యాసిక్యూటర్‌గా నియామకం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆప్కో రాష్ట్ర మాజీ చైర్మన్ గడ్డం జగన్నాథం మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.నర్సింగం, భవన, రుషి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.